క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీ మెట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సతీమణి భ్రమరాంబ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్నేని కాంతారావు, మల్లూరు అంకమరాజు, కాజా శ్రీను, మండపాటి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో మట్టా దయానంద్

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరాయి. సత్తుపల్లిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో మట్టా దయానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్ ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరగా.. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి పెద్ద అమరయ్య, పాలెపు కోటి, చింతల నాగయ్య, తాళ్లూరి ఆదినారాయణ పాల్గొన్నారు.

గోపాలమిత్ర వైద్య శిబిరం

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లిలో పశుగణాభివృద్ధి సంస్థ, గోపాలమిత్ర వైద్య శిబిరం మంగళవారం విజయ వంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొణిజర్ల పశువైద్యాధికారి డాక్టర్ బి.శ్రీనివాస్ పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ చేయించారు. దూడలకు విటమిన్, నట్టల నివారణ మందులు తాగించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, గోపాల మిత్రలు గడల రామారావు, సైదులు, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, పుల్లయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన



చిన్నారిని ఆశీర్వదిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బానోత్ రాందాస్ నాయక్ మనవరాలు దీక్షిత అన్నప్రసాన వేడుకకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై మంగళవారం చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంతగుడి చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు మేదరి టోనీవీర ప్రతాప్, గుగులోత్ భీముడు నాయక్, గౌస్‌పాషా, రాంచందర్, బాబు, గాంధీ, రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పర్యటించనున్నట్లు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, అన్నారుగూడెం, తల్లాడ, పినపాక, మంగాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే హాజరౌతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండలపాడు, లక్ష్మీపురం, ముసలిమడుగు, కొండకొడిమ, ఖానాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళలకు క్రీడా పోటీలు

మధిర: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత పాల్గొని మాట్లాడుతూ.. జ్యోతిబాపూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని మహిళా ఉపాధ్యాయులు బాలికా విద్య కోసం కృషి చేయాలన్నారు.

శంభో శంకర





మృత్యుంజయ స్వామి ఆలయం

శివలింగానికి నేరుగా అభిషేకం చేసే అవకాశం

- కాశీ నుంచి మధిరకు చేరిన వైనం..
- చిన్న కాశీగా పేరొందిన పవిత్ర పుణ్యక్షేత్రం
- పంచముఖ ద్వారాలు ఉన్న దేవాలయం

మధిర: మధిర శివయ్యకు భక్తులే స్వయంగా అభిషేకం చేస్తుంటారు. మధిర పట్టణంలోని వైరా నది ఒడ్డున శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయ గర్భగుడిలోకి భక్తులు నేరుగా వెళ్లి స్వయంగా అభిషేకం చేస్తుంటారు. అదే విధంగా ఈ ఆలయం పంచముఖ ద్వారాలతో కాశీలో మాదిరిగా పడమర దిక్కున వైరా నది, ఉత్తరం దిక్కున శ్మశానం ఉండి పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న కాశీగా పేరొందింది. ఇక్కడ భక్తుల కోరికలు తీర్చే గొప్ప పుణ్యక్షేత్రంగా ఈ దేవాలయానికి పలు ప్రత్యేకతలు ఉన్నాయి.

శివలింగం విశిష్టత..

తమిళనాడు రాష్ట్రంలోని మధురై పుణ్యక్షేత్రంలో శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు కాశీ నుంచి రైలులో ట్రాన్స్‌పోర్ట్ చేయబడిన శివలింగం మధురైకి చేరుకోవాల్సి ఉండగా అనుకోని విధంగా మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ పరమశివుడే తన ఆత్మ రూపంలో మధిరలో కొలువుదీరేందుకు వచ్చాడని భక్తులు రైల్వేస్టేషన్‌లోనే ఆ శివలింగానికి పూజలు నిర్వహించారు. వెంటనే శివలింగ ప్రతిష్ఠకు సన్నాహాలు చేశారు.

– శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రజలు మధిర పట్టణంలో పడమర వైపున నదీ ప్రవాహం, ఉత్తరం వైపు శ్మశానం కలిగి ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి మృత్యుంజయ స్వామి దేవాలయం పేరుతో 1965 మార్చి 1న శని త్రయోదశి రోజున ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్యం భక్తులతో కాశీలో మాదిరిగానే మధిరలో కూడా నిత్యం భక్తులచే పూజలు అందుకుంటూ మరో కాశీ మాదిరిగా ప్రసిద్ధి చెందింది.

ఆలయ ప్రత్యేకత..

ఈ ఆలయ గర్భగుడికి నాలుగు దిక్కుల ద్వారములు ఏర్పాటు చేయడంతో స్వయంగా భక్తులు స్వామికి స్వయంగా అభిషేకాలు చేస్తుంటారు. గర్భాలయంలోనే శివలింగానికి నైరుతి మూలలో శ్రీ గురుదత్త స్వామి విగ్రహం ఉండటం ఇక్కడి విశిష్టత. అదే విధంగా ఈ ఆలయంలో గంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజయ స్వామి శివలింగంతో పాటు పార్వతిదేవి అమ్మవారు, విఘ్నేశ్వర, దత్తాత్రేయ, పంచముఖ ఆంజనేయ, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలతో ఉన్న ఈ దేవాలయంలో నవగ్రహాలు కూడా కొలువై ఉన్నాయి. ఈ దేవాలయం పక్కనే రజాకార్ల తూటాలకు బలైన వానరానికి నిర్మించిన దేవాలయంలో కూడా నిత్యం పూజలు నిర్వహిస్తుంటారు.

శివరాత్రి జాతర..

ఇక్కడ ప్రతీ సంవత్సరం ఐదురోజులపాటు మహాశివరాత్రి తిరునాళ్లు నిర్వహిస్తారు. ఈ నెల 7నుంచి 11 వరకు నిర్వహించే జాతరకు ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు వేల సంఖ్యలో హాజరై శివలింగానికి అభిషేకం నిర్వహిస్తుంటారు. మహాశివరాత్రి, కార్తీక మాసం నెలరోజుల సందర్భంగా జరిగే ఉత్సవాల్లో ఆ పరమశివుడే ఇక్కడ కొలువుతీరి ఉంటాడని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా భారీగా బొమ్మల దుకాణాలు, జాయింట్ వీల్స్, తదితర రకాల వినోద కార్యక్రమాలతో పాటుగా భక్తుల సౌకర్యార్థం తాటాకు పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేస్తారు. ప్రతి శివరాత్రికి అర్ధరాత్రి 12 గంటలకు శ్రీ మృత్యుంజయ స్వామి కల్యాణంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మడుపల్లి గ్రామానికి వెళ్లేందుకు వైరా నదిలో ప్రత్యేక రహదారిని నిర్మించారు. గత 59 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి జాతరలో భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి తమ పూర్వీకులకు పిండ ప్రధానం చేసి మొక్కులు తీర్చుకోవడం విశేషం.



ఆలయంలో కొలువుదీరిన మృత్యుంజయ స్వామి

ఆలయ అభివృద్ధి..

భక్తుల సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి 2021 సంవత్సరంలో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. విఘ్నేశ్వరుడు, పంచముఖ ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాలకు ఈ ఆలయంలో నూతనంగా ఉప ఆలయాలు ఏర్పాటు చేశారు. 2023 ఫిబ్రవరి 5న ఆలయ పనులు పూర్తిచేసి ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. ప్రతి ఏడాది కార్తీకమాసంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో మహిళలు ఆలయం వద్ద బతుకమ్మలను ఉంచి అత్యంత వైభవంగా గౌరీదేవి పూజలు నిర్వహించి ఎదురుగా ఉన్న వైరా నదిలో బతుకమ్మలను సాగనంపుతారు. విజయదశమి రోజున అమ్మవారికి నదీతీరంలో తెప్పోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.



వైరా నదిలో ప్రత్యేక రహదారి

సమయపాలన పాటించాలి



మెప్మా ఆర్‌పీలకు వేతనాల చెక్కు అందజేస్తున్న కమిషనర్ వేణు

వైరా: మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ సీహెచ్.వేణు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సమయ పాలన పాటించిన ఉద్యోగులపై చర్యలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల్లోపే కార్యాలయానికి చేరుకుని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరిస్తూ ప్రజల సందేహాలు నివృత్తిచేయాలని సూచించారు. కాగా, మున్సిపాలిటీలో పరిధిలోని మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీలకు గత ఏడు నెలల వేతనం చెక్కు కమిషనర్ వేణు అందజేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఆర్‌పీల సమీక్షలో పాల్గొన్న ఆయన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ, రికవరీపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు. కాగా, 8వ వార్డు బోడేపూడి కాలనీలో ఇళ్ల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానికులు ఆయనను కలిసి సెల్ టవర్ నిర్మాణంపై ఫిర్యాదు చేయగా నిర్మాణ బాధ్యులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు నిలిపివేయాలన్నారు.

చొప్పకట్లపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మంగళవారం సింగిల్ ఫేజ్ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మధిర ఏడీఈ అనురాధ, ఏఈ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి జి.అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ అనురాధ మాట్లాడుతూ.. గ్రామస్తుల విద్యుత్ వినియోగం డిమాండ్ పెరగడంతో అవసరమైన మేరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం ఎర్రుపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వచ్చి రికార్డులను పరిశీలించి ఏఈ అనూషతో మాట్లాడి వివరాలు సేకరించారు. సబ్ ఇంజనీర్లు లావణ్య, జీనా, మాజీ సర్పంచ్ వడ్లకుంట పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏడీఈ అనురాధ

అసైన్డ్ భూమిలో అధికారుల సర్వే



అసైన్డ్ భూమిలో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ డివిజన్ అధికారులు

కల్లూరు: కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాన్‌ఖాన్‌పేట గ్రామం శివారు తిరువూరు క్రాస్‌రోడ్ వద్ద గల 5/2 సర్వే నంబర్ భూమిలో మంగళవారం ఆర్డీఓ కె.శ్రీనివాస్, డీఐఓ వెంకటరావుల సమక్షంలో సర్వే నిర్వహించారు. నాడు సత్తుపల్లి తాలూకాగా ఉన్న సమయంలో 1975లో కొందరు గిరిజనులకు అసైన్డ్ భూమిలో 1.10 ఎకరాలను, ఎస్‌డీఆర్ ప్రకారం మరో 36 కుంటల స్థలంలో 21 మందికి పట్టాలు ఇచ్చారని ఆధారాలు చూపిస్తూ ఖాన్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన కునుసోత్ రవికుమార్, డి.సక్రితో పాటు మరికొందరు 2004లో హైకోర్టును ఆశ్రయించారు. నాటి నుంచి సాగుతున్న ఈ కేసు ఎట్టకేలకు హైకోర్టువారు రెవెన్యూ శాఖ తరపున నోటీసులు జారీచేశారు. దీంతో సర్వే జరుగుతున్న భూమి వద్దకు పిటీషన్‌దారులు హాజరైయ్యారు. వివాద స్థలంలో సర్వే నిర్వహించి.. నివేదికను బహిరంగ పరుచకుండా కోర్టుకి అందజేయాలని ఆదేశం మేరకు రెవెన్యూ డివిజన్ తరపున అధికారులు తుది నివేదికను పంపినట్లు స్థానిక రెవెన్యూ అధికారి విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం కోర్టులో వివాదం ఉండడంతో అక్కడ ప్రారంభించిన ఏసీపీ కార్యాలయం, సబ్‌రిజిస్టార్ కార్యాలయం, గోదాము భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.

తల్లాడ, గొల్లగూడెం, కిష్టాపురం గ్రామాల్లో రీ సర్వే



గొల్లగూడెంలో ధరణి పెండింగ్ సమస్యలపై సర్వే చేస్తున్న అధికారులు

తల్లాడ: ధరణిలో నెలకొన్న పెండింగ్ సమస్యలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం రీ సర్వే చేశారు. తల్లాడ, గొల్లగూడెం, కిష్టాపురం గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ధరణి భూములను సర్వే చేశారు. ఈ నెల 9వ తేదీలోపు ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆయా గ్రామాల్లో సిబ్బంది భూములను రీ సర్వే చేస్తున్నారు. కార్యక్రమంలో తల్లాడ ఆర్‌ఐ భాస్కర్ నాయక్, ఏఈఓ గురుమూర్తి, గొల్లగూడెం కార్యదర్శి చిలుకూరి యాకయ్య పాల్గొన్నారు.

భూసమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం



ఆర్డీఓ శ్రీనివాస్

కల్లూరు: భూసమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని ఆర్డీఓ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల నుంచి ధరణి పోర్టల్‌లో 1,588 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు క్షేత్ర స్థాయిలో 422 దరఖాస్తులు పరిశీలించడం జరిగిందని.. మిగిలినవి ఈ నెల 9లోగా పరిశీలించడం జరుగుతుందన్నారు. దరఖాస్తులలో ముఖ్యంగా రైతుల ఖాతా నంబర్ ప్రకారం పేర్లు తప్పులు, పాస్ పుస్తకాల్లో భౌతికంగా భూమిలో గల వ్యత్యాసాలు, ఇతర సమస్యలు కలిగిన దరఖాస్తులు ధరణిలో పెండింగ్‌లో ఉండగా భూముల సమస్యల దరఖాస్తుల పరిశీలన అనంతరం తుది నివేదికను పై అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలో గ్రామాల్లో అధికారుల బృందాలు విస్తృతంగా పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి



సింగరాయపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న రైతు సంఘం నాయకులు

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ధరణి సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని సింగరాయపాలెంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిశీలనకు బృందాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని.. కానీ అన్ని సమస్యలకు గతంలో మీ సేవా కేంద్రాల్లో పరిష్కారం కాలేదని దీంతో రైతులకు సాగు చేసుకోకుండా ఉడాల్సివచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతనిప్పు చలపతిరావు, దొడ్డపనేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, రాచబంటి రామయ్య, అనుమోలు వెంకటేశ్వరరావు, ఖాసీమ్‌బేగ్, అఫ్జల్ పాల్గొన్నారు.

నేడు రైతులకు ఆన్‌లైన్ శిక్షణ

కొణిజర్ల: బుధవారం మండలంలోని తనికెళ్ల రైతు వేదిక వద్ద దృశ్య శ్రవణ విధానంలో ఆధునిక సాంకేతిక వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లో సదస్సును రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, పట్టు పరిశ్రమల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు మండలంలోని రైతులు, అన్ని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు



సరుకులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: లయన్స్ క్లబ్ వీడీజీ–2 నంబూరి మధు జన్మదినం సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు బీటెక్ విద్యార్థిని బాణాల ఉమాదుర్గకు రూ.40 వేల విలువైన ల్యాప్‌టాప్, నిరుపేద మహిళ గజ్జెల సావిత్రి జీవనోపాధి కోసం కుట్టుమిషన్, శాంతినగర్‌కు చెందిన మోదుగు సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతుండగా నిత్యావసర వస్తువులు, చిరు వ్యాపారం చేసుకునే మహిళలకు గొడుగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ సీహెచ్‌వీ.శివప్రసాద్ మాట్లాడారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, పెనుగొండ ఉపేందర్‌రావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, శ్యాంబాబు, ప్రభాకర్, నాగేశ్వరరావు, విజయ రాణి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, సునీత, శ్రీనివాసరావు, రామారావు, నాగేశ్వరరావు, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సేవాసదనానికి కుర్చీలు వితరణ



మధిరరూరల్: మధిర పట్టణంలోని మానసిక వికలాంగుల సేవాసదనానికి కేతేపల్లి యశ్వంత్ సాయి తనకు ఉద్యోగం ద్వారా నూతనంగా వచ్చిన మొదటి జీతంలో కొంత డబ్బులను వెచ్చించి కుర్చీలను కొనుగోలు చేసి సేవాసదనానికి వితరణగా అందజేశాడు. ఎర్రుపాలెం గ్రామానికి చెందిన కేతేపల్లి నరసింహారావు, రాజేశ్వరి దంపతుల కుమారుడు యశ్వంత్ సాయికి ఉద్యోగం వచ్చింది. జీతంలోని కొంత డబ్బులను రూపానంద జిరాక్స్ యజమాని రూపావతి ప్రోత్సాహంతో మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో పిల్లలు కింద కూర్చొని భోజనం చేస్తుండటం వల్ల వారికి కావాల్సిన 20 కుర్చీలను వితరణంగా అందజేశాడు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. వికలాంగుల పట్ల ప్రేమ, జాలి కలిగి కుర్చీలు వితరణగా అందజేసిన యశ్వంత్ సాయికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలైయ్యాయి. నాగేశ్వరరావు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అల్లీపురం గ్రామంలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వేగంగా ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో అతని రెండు కాళ్లు విరిగిపోయి ఎముకలు బయటకు వచ్చాయి. కారు ఆగకుండా వెళ్లిపోయింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అతన్ని హైదరాబాద్ తరలించారు.

సిరిపురం గ్రామంలో..

మధిరరూరల్: మండలంలోని సిరిపురంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కలకోటకు చెందిన బొగ్గవరపు ధర్మారావు మోటార్ సైకిల్‌పై మధిరకు వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలవడంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సబ్‌స్టేషన్‌లో విద్యుత్ తీగల బండిల్ చోరీ

కారేపల్లి: మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గుర్తుతెలియని దుండగులు చొరబడి 3 విద్యుత్ తీగల బండిల్‌ను బొలేరోమాక్స్ వాహనంలో చోరీకి పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వాహనంలో విద్యుత్ తీగల బెండల్‌ను చోరీకి పాల్పడుతుండగా.. సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆపరేటర్ గమనించి అడ్డుకునే ప్రయత్నం చేయగా తప్పించుకోపోయారని, దీనికి సంబంధించి కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ స్థానిక విలేకరులకు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన



చింతకాని: రామకృష్ణాపురంలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ కొరివీరమ్మ



ఎర్రుపాలెం: ములుగుమాడులో శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీటీసీ సభ్యురాలు మార్గం కొరివీరమ్మ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి శివమ్మ, గ్రామ మాజీసర్పంచ్ గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు తూము అంజయ్య, గాదె రామారావు, తూము కోటేశ్వరరావు, తిరుపతి యాదయ్య, కొర్లపాటి అంజి, గ్రామ పంచాయతీ కార్యదర్శి దేగల సురేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కృషితో ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు మంగళవారం కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గంటా తిరుపతమ్మ, కఠారపు బ్రహ్మయ్యలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి భట్టి చేస్తున్న కృషిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, నాయకులు బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, మెట్టు కృష్ణ, జిల్లిపల్లి కాంతారావు, కృష్ణారావు, గంటా వెంకటేశ్వరరావు, కడియం శ్రీనివాసరావు, నందిగం సందీప్, రేలచర్ల శ్రీనివాసరావు, వాసు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.